వైభవం.. తిరునాళ్ల మహోత్సవం

● దోనేపూడిలో తిరుపతమ్మ తిరునాళ్లకు పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకారంలో దేవతామూర్తులు



పొంగళ్ల పాత్రలు తలపై మోస్తూ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

కొల్లూరు: తిరుపతమ్మ తిరునాళ్ల మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. మండలంలోని దోనేపూడిలో గురువారం తెల్లవారుజాము నుంచి తిరునాళ్ల సందర్భంగా తిరుపతమ్మ ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. కొల్లూరు, భట్టిప్రోలు, వేమూరు పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి దైవదర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రాంతంలో మహిళలు పొంగళ్లు తయారు చేసి పాత్రలు తలపై ధరించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు జరిపి అమ్మ వారికి నైవేద్యం సమర్పించారు. తిరునాళ్ల సందర్భంగా ట్రాఫిక్ అవంతరాలు ఏర్పడకుండా రేపల్లె–తెనాలి ప్రధాన రహదారిలో వాహనాలను కరకట్ట మీదుగా మళ్లించిన పోలీసులు ఆలయం వద్ద అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. రాత్రిళ్లు వేలాదిగా తరలివచ్చే భక్తులు, ప్రజల కోసం ఆలయ ప్రాంగణం వద్ద పలు దుకాణాలు ఏర్పాటు చేయడంతోపాటు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. తిరునాళ్ల సందర్భంగా వచ్చే భక్తులకు ఆరోగ్యపరమైన సమస్యలు ఎదురైతే తక్షణ వైద్యసాయం అందజేసేందుకు ప్రభుత్వం దోనేపూడి ఆరోగ్య ఉపకేంద్రం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా మెడికల్ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు.

పేదల అభ్యున్నతే సీఎం జగన్ లక్ష్యం



మహిళకు సంక్షేమ పథకాల కరపత్రం అందజేస్తున్న మంత్రి నాగార్జున

● మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున
● పెదపులివర్రులో గడప గడపకు మన ప్రభుత్వం

పెదపులివర్రు(భట్టిప్రోలు): పేదల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున అన్నారు. భట్టిప్రోలు మండలం పెదపులివర్రు పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని గాజులపేట, గుత్తావారిపాలెంలలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి నాగార్జున పాల్గొన్నారు. గాజులపేటలో 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.8.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నాగార్జున మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, కాబట్టే నిర్భయంగా ప్రజల్లోకి వెళ్లగలుగుతున్నామన్నారు. ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, సర్పంచ్ నీలా ఉషారాణి, ఉప సర్పంచ్ కొర్ల మాధవ, గ్రామ పార్టీ కన్వీనర్ కొనకాల శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు, నాయకులు నీలా రమేష్, దావూరి నాగమల్లేశ్వరరావు, నీలా సతీష్, నీలా నాగరాజు, జంపని వెంకటేశ్వరరావు, ఉప్పాల నాగార్జున, వాకా సుజాత, అనగాని రమేష్, ముత్తిరెడ్డి సాంబశివరావు, బుస్సా రాజారత్నం, పార్టీ పరిశీలకులు బొప్పరాజు జ్యోతి, బడుగు ఇందిర, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాలు

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కోన రఘుపతి



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న బాపట్ల ఎమ్మెల్యే కోన

పిట్టలవానిపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని బాపట్ల శాసన సభ్యులు కోన రఘుపతి అన్నారు. పిట్టలవానిపాలెం మండలం చందోలు–1 గ్రామ సచివాలయం పరిధిలోని మండేవారిపాలెం గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గ్రామ సర్పంచి గౌరీదేవి విజయకుమారి, మునీర్, ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ అహ్మద్ హుస్సేన్, ఎంపీపీ షేక్‌బాజీల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అంటూ ప్రజలను ఆరా తీశారు. అలాగే గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో రూ.లక్షలు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన కుటుంబాలు ఉన్నాయన్నారు. చందోలు శివారు నదిముల్లాయపాలెం నుంచి ప్రారంభించి కత్తివారిపాలెం గ్రామం వరకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు దెందుకూరి సీతారామరాజు, చేబ్రోలు కృపానందం, పార్టీ నాయకులు గోవతోటి విజయ్, ఎంపీటీసీ షేక్ కరీ మున్నీసా, చల్లాపల్లి విజయరాజు, చందోలు గ్రామ ఉపసర్పంచి చేబ్రోలు వీరయ్య, పార్టీ నాయకులు వాలిశివారెడ్డి, చేబ్రోలు రవికుమార్,శ్యామల నాగిరెడ్డి, బొలగాని సుబ్బారావు,దబ్బుకూటి మాధవరావు తదితరులు ఉన్నారు.

సుస్థిర సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలి



చెరుకుపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు, రైతులు

పిట్టలవానిపాలెం: సుస్థిర సేంద్రియ వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని గోకరాజునల్లిబోయినవారిపాలెం గ్రామ సర్పంచి దబ్బుకూటి మాధవరావు తెలిపారు. మండలంలోని గోకరాజు నల్లిబోయినవారిపాలెం గ్రామంలో గురువారం సుస్థిర సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయంలో ఘన జీవామృతంతో విత్తన శుద్ధి చేయడం వలన మొక్కల్లో వ్యాధి నిరోధక శక్తి పెరగడంతో పాటు మొలక శాతం పెరుగుతుందని తెలిపారు. రైతుల సమక్షంలో 30 రకాల విత్తనాలతో సాగు, నేలతల్లి బాగు అనే అంశంపై విత్తన గుళికలు తయారు చేసి రైతులకు వివరించారు.అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. 30 రకాల విత్తనాలతో సాగు చేయడం వల్ల భూసారం పెరుగుతుందని వివరించారు.ఈకార్యక్రమంలో జెడ్‌బీఎన్ఎఫ్ యాక్టివిస్ట్ ఎం.వరదానం, సిబ్బంది, రైతులు ఉన్నారు.

చెరుకుపల్లిలో...

చెరుకుపల్లి: ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులకు తక్కువ ఖర్చుతో ఆరోగ్యవంతమైన ఆహార ధాన్యాలు లభిస్తాయని, అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి బాలాజీ గంగాధర్ రైతులకు తెలిపారు. మండలంలోని తూర్పు పాలెం గ్రామంలో గురువారం రైతు సాధికార సంస్థ, బాపట్ల జిల్లా ప్రకృతి వ్యవసాయం (ఏపీసీఎన్ఎఫ్) వారి ఆధ్వర్యంలో నవధాన్యాలతో సాగు– నేల తల్లి బాగు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులు, విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచి తూము రమాదేవి, ఉప సర్పంచి పూషడపు సుబ్రహ్మణ్యం, వ్యవసాయ అధికారులు సుధాదేవి, జ్యోతి, పావని, రైతులు పాల్గొన్నారు.

చిన్నారుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించాలి



రేపల్లె రూరల్: విద్యార్థి దశ నుంచే చిన్నారుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేలా చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ క్రాప్ సంస్థ పని చేస్తుందని సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ క్రాప్ ఆధ్వర్యంలో మండలంలోని నల్లూరుపాలెం, చోడాయపాలెం గ్రామాలలోని చిన్నారులకు గ్రామాల అభివృద్ధిపై గురువారం బాలల పంచాయతీ వార్షిక సర్వసభ్య సమావేశాలు నిర్వహించి అనంతరం మాట్లాడారు. విద్యార్థులకు గ్రామ సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు, చేపట్టాల్సిన కార్యక్రమాలు, పరిష్కార మార్గాలపై అవగాహన కల్పించేందుకే ఈ వార్షిక సర్వసభ్య సమావేశాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన అభినయం పలువురిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో గ్రామస్తులు, చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ క్రాప్ సభ్యులు పాల్గొన్నారు.

ధాన్యం లోడుట్రాక్టర్ ట్రక్కు బోల్తా



కర్లపాలెం: ధాన్యం లోడుతో వెళుతున్న ట్రాక్టర్ ట్రక్కు జాతీయ రహదారిపై బోల్తాపడిన సంఘటన గురువారం మండల పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కడవకుదురు గ్రామం నుంచి ధాన్యం లోడుతో చెరుకుపల్లి వెళుతున్న ట్రాక్టర్ ట్రక్కు టైరు పేలటంతో దుండివారిపాలెం పంచాయతీ శ్రీరామ్‌నగర్ గ్రామం వద్ద జాతీయ రహదారిపై ట్రక్కు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ధాన్యం బస్తాలు రోడ్డుపై పడిపోయినప్పటికీ ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని స్థానికులు తెలిపారు.

పశువిజ్ఞాన బడి

నగరం: వేసవిలో పశువుల ఆరోగ్య విషయంలో పశుపోషకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర పశుగణన వ్యవస్థాపక యాజమాన్య సంస్థ సంయుక్తి సంచాలకులు డాక్టర్ పి.రమణయ్య తెలిపారు. నగరం మండలం కొలగానివారిపాలెంలో పశువిజ్ఞాన బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ రమణయ్య పశువుల పట్ల రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అదేవిధంగా లేగ దూడల పెంపకంలో మెలకువలు, లాభసాటి పాడిపరిశ్రమ వంటివి వివరించారు. బాపట్ల జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎం .హనుమంతరావు మాట్లాడారు. నగరం సహాయ సంచాలకులు నాగేశ్వరరావు, మండల పశువైద్యాధికారి డాక్టర్ షేక్ కరిముల్లా, మాజీ సర్పంచి కొలగాని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్

రేపల్లె రూరల్: అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న సంఘటన పట్టణంలోని ఇసుకపల్లిలో చోటు చేసుకుంది. సీఐ విజయ చంద్ర తెలిపిన వివరాల మేరకు ఇసుకపల్లికి చెందిన దుగ్గి బాబూరావు అక్రమంగా గంజాయి విక్రయాలు చేస్తున్నాడని అందిన సమాచారంతో తహసీల్దార్ మల్లికార్జునరావుతో కలిసి దాడులు నిర్వహించామన్నారు. దాడులలో బాబూరావు వద్ద నుంచి 520 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని కోర్టుకు హాజరుపరిచామన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే సహించేది లేదన్నారు.

గాజులపేటలో చోరీ

పెదపులివర్రు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పెదపులివర్రు పంచాయతీలోని గాజులపేటలో గురువారం ఓ ఇంట్లో చోరీ జరిగింది. కూలి పనికి వెళ్లి వచ్చిన బొర్రా పాకలమ్మ ఇంటికి వచ్చి చూడగా తలుపులు బీరువా కూడా బద్దలుకొట్టి ఉండటంతో అప్పుడే గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా గాజులపేటలో పర్యటిస్తున్న మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున దృష్టికి ఆమె తీసుకువచ్చారు. స్పందించిన ఆయన ఎస్ఐ వై.సురేష్‌ను ఇంటిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బీరువాలోని రూ. 5 వేలు నగదు, వెండి పట్టాలు అపహరణకు గురైనట్లు పాకలమ్మ ఎస్ఐకు తెలిపింది. గత ఏడాది డిసెంబర్ 29వ తేదీన ఇదే విధంగా ఇంట్లోని బీరువాలో రూ. 50 వేలు నగదు, 6 గ్రాముల బంగారం చోరీ చేసినట్లు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ పరిశీలించి వివరాలు సేకరించారు.

బండ్లమ్మ దేవాలయంలో నేడు బహిరంగ వేలం

చందోలు(పిట్టలవానిపాలెం): పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న బగళాముఖి బండ్లమ్మ వారి దేవాలయంలో ఎలక్ట్రికల్ డెకరేషన్, సప్లయి కంపెనీ సామాన్లు, అద్దెకు ఇచ్చు హక్కు కోసం మార్చి 10 వ తేదీన ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. 2023 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2024 ఏప్రిల్ 1వ తేదీ వరకు దేవాలయం ఆవరణలో టెంట్ సామగ్రి, వంట సామగ్రి, ఫంక్షన్‌లకు ఎలక్ట్రికల్ సామగ్రి అద్దెకిచ్చు హక్కు కొరకు బహిరంగ వేలం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు డిపాజిట్ రుసుము రూ.5 వేలు చెల్లించి ఈవేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

హుండీల లెక్కింపు...

చందోలు గ్రామంలోని లింగోద్భవస్వామి వారి దేవస్థానం, చెన్నకేశవస్వామి వారి దేవస్థానాల్లోని కానుకల హుండీలను శుక్రవారం ఉదయం 11 గంటలకు లెక్కించనున్నట్లు తెలిపారు. భక్తులు సమర్పించిన కానుకలను భక్తుల సమక్షంలో లెక్కించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన భక్తులు హాజరు కావలసిందిగా ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి కోరారు.

ఆలయ అభివృద్ధికి భూమిపూజ



ఆలయ ప్రాంగణంలో భూమిపూజ చేస్తున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు

నిజాంపట్నం: దేవాలయాల అభివృద్ధితో గ్రామాల్లోని ప్రజలు సుఖసంతోషాలతో, పాడి పంటలతో ఉంటారని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు ఆకాంక్షించారు. నిజాంపట్నం మొగదారమతల్లి ఆలయ ప్రాంగణంలో టైల్స్ నిర్మాణ పనులకు గురువారం ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మోపిదేవి మాట్లాడుతూ ప్రతి ఏడాది మొగదారమ్మతల్లి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించుకోవడం ఆనవాయితీ అన్నారు. అందులో భాగంగా ఈ ఏడాది త్వరలో జరగనున్న ఉత్సవాల నాటికి ఆలయ ప్రాంగణం మొత్తం టైల్స్ నిర్మాణాన్ని చేపట్టేందుకు చర్యలు చేపట్టడం మంచి పరిణామమన్నారు. ఆలయాన్ని మరింత అభివృద్ధి పరిచేందుకు తన వంతు కృషిని ఎల్లవేళలా అందిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా టైల్స్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఎంపీపీ మోపిదేవి విజయ నిర్మల హరనాథబాబు, జెడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, మాజీ ఎంపీపీ ప్రసాదం వాసుదేవ, బోటు ఓనర్స్ యూనియన్ అధ్యక్షుడు కన్నా శ్రీనివాసరావు, మోపిదేవి శ్రీనివాసరావు, మార్కండేయులు, కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు బానిసలైతే జీవితం అంధకారమే

డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ఎ. శ్రీనివాసరావు

బాపట్లటౌన్: డ్రగ్స్‌కు బానిసలైతే జీవితం అంధకారంగా మారుతుందని బాపట్ల డీఎస్పీ ఎ. శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం మాదక ద్రవ్యాల నివారణలో భాగంగా సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఎస్పీ ఎ. శ్రీనివాసరావు మాట్లాడుతూ డ్రగ్స్‌కు దూరంగా ఉన్నప్పుడే ఉజ్వల భవిష్యత్ విద్యార్థుల సొంతమవుతుందన్నారు. మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టే లక్ష్యంగా ప్రారంభించబడిన కార్యక్రమమే 'సంకల్పం' అన్నారు. బాపట్ల జిల్లాను గంజాయి, మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చి దిద్దే చర్యలలో భాగంగా బాపట్ల, ప్రకాశం జిల్లాల ఎస్పీలు సంయుక్తంగా 'సంకల్పం– డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాటం' అనే నూతన అవగాహన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. డ్రగ్స్ కు సంబంధించిన సమాచారం అందించడంకోసం ప్రతి కళాశాలలో ఒక 'డ్రాప్ బాక్స్' ఏర్పాటు చేశామన్నారు. ఈ 'డ్రాప్ బాక్స్' లో ఎవరైనా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఇతర కళాశాల సిబ్బంది డ్రగ్స్ పై వారికి ఉన్న సమాచారం రాసి ఆ 'డ్రాప్ బాక్స్' లో వేస్తే దానిని కాలేజీ కమిటీ వారు చూసి చదివి తగు చర్యల నిమిత్తం పోలీస్ సహాయం కోరే విధంగా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. డ్రగ్స్ కు సంబంధించిన పోస్టర్‌లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలను డ్రగ్స్ రహిత కాలేజీగా తీర్చిదిద్దేందుకు మేమంతా పాటుపడుతాం అంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. రూరల్ సీఐ జి.వేణుగోపాలరెడ్డి, బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, కార్యదర్శి మానం నాగేశ్వరరావు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో ఉగాది నాటికి గృహ ప్రవేశాలు

రేపల్లె ఆర్డీఓ జగన్నాథం పార్థసారధి



భట్టిప్రోలు లే-అవుట్‌లో రికార్డులు పరిశీలిస్తున్న రేపల్లె ఆర్డీఓ జగన్నాథం పార్థసారథి

అద్దేపల్లి(భట్టిప్రోలు): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న కాలనీల్లో సత్వరం నిర్మాణాలు జరిగి, ఉగాది నాటికి గృహప్రవేశాలు జరగాలని రేపల్లె ఆర్డీఓ జగన్నాథం పార్థసారథి సూచించారు. భట్టిప్రోలు సచివాలయం–2ను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయంలో అందిస్తున్న సేవలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పనితీరు, ప్రభుత్వ పథకాల అమలు, పని వేళలు, హాజరు శాతం వంటి పలు అంశాలను పరిశీలించారు. గ్రామ సచివాలయాల్లో అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను పరిశీలించి మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి పలు సూచనలు అందించారు. ఆయన వెంట సచివాలయం కార్యదర్శి పిట్ల శ్రీనివాసరావు, ఆర్ఐ శివరామకృష్ణ, వీఆర్ఓ అంబటి ప్రసాద్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సాగర్, పాల్గొన్నారు.

ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు



పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అర్చకులు

బాపట్ల అర్బన్: బాపట్లలోని ఎస్ఎన్‌పీ అగ్రహారం బెండపూడి సీతారామమ్మ తోటలో వేంచేసి ఉన్న కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిశాయి. స్వామివారికి 5వ రోజున పుష్పయాగాలతో వివిధ రకాల ఫలాలతో ఫలపుష్ప పూజలు నిర్వహించారు. భక్తుల కోర్కెలు తీర్చే స్వామి వారి దివ్య ఆశీస్సులు అందరికీ ఉండేలా పుష్పయాగం శ్రీమాన్ బెండపూడి వెంకటసుబ్బారావు తనయుడు దుర్గాప్రసాద్ పర్యవేక్షణలో కార్యక్రమం దిగ్విజయంగా జరిగింది. అనంతరం స్వామి వారికి తిరుప్పావై సేవ, కుంభ ప్రసాద నివేదన కార్యక్రమంలో అనేకమంది భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించి స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. భక్తులు విశేషంగా పాల్గొని స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. బెండపూడి వెంకట సుబ్బారావు దుర్గాప్రసాద్, జితేంద్ర శ్రీనివాస్, సుబ్బరామయ్య, ఎ.శ్యాంసుందర్రావు, కె.సుబ్బారావు (గురుస్వామి) పాల్గొన్నారు.

జగనన్న గోరుముద్ద పథకం పరిశీలన



జగనన్న గోరుముద్ద పథకం పనితీరును పరిశీలిస్తున్న ఎంఈఓ వెంకటేశ్వరరావు

పిట్టలవానిపాలెం: విద్యాప్రమాణాలు పెంపుదలకు ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాశాఖాధికారి ఉయ్యూరి వెంకటేశ్వరరావు తెలిపారు. మండల కేంద్రంలోని మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలో తనిఖీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థుల హాజరును పరిశీలించారు. పాఠశాలలోని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జగనన్న గోరుముద్ద పథకం పనితీరును పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా మెనూను అమలు చేయాలని తెలిపారు. ఆయనవెంట సీఆర్పీలు ముసలయ్య, స్రవంతి, హెచ్ఎం మూకిరి ప్రకాశరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

జంపనిలో...

జంపని(వేమూరు): విద్యార్థులకు పాఠాలు చెప్పడంలో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని మండల విద్యా శాఖాధికారి కాజా లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలోని జంపని గ్రామంలోని బీఎఫ్ఎస్ మండల పరిషత్ పాఠశాలలో గురువారం ఆయన రికార్డులు తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఆర్.అపర్ణ, ఈపూరు రాజవర్ధన్ పాల్గొన్నారు.

చదలవాడలో...

చదలవాడ(వేమూరు): మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం ఉండాలని మండల ప్రత్యేకాధికారి పద్మజా రెడ్డి తెలిపారు. మండలంలోని కాకర్లమూడి గ్రామంలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆమె మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలించారు. చదలవాడ గ్రామ సచివాలయం, అంగన్ వాడీ కేంద్రాలను సందర్శించి, రికార్డులు పరిశీలించారు. అంగన్ వాడీ సూపర్ వైజర్ రత్న కుమారి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

సాయిబాబా గ్రంథ పఠనంతో సకల శుభాలు

భట్టిప్రోలు: షిర్డీ సాయిబాబా జీవిత సచ్చరిత్ర గ్రంథ పఠనం వల్ల సకల శుభాలు కలుగుతాయని అఖిలాండ కోటి అఖండ జ్యోతి నిర్వాహకుడు శ్రీ రామ్‌జీ గురువు అన్నారు. భట్టిప్రోలు మండలం పెదపులివర్రులోని శ్రీ షిర్డి సాయిబాబా మందిరంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో భక్తులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ లోక కల్యాణార్థం అత్యంత ప్రీతి పాత్రమైన సామూహిక శ్రీ విష్ణు సహస్ర నామపారాయణ, సహస్ర దీపోత్సవం నిర్వహించడం వల్ల సత్ఫలితాలు లభిస్తాయని తెలిపారు. అలాగే గత నెల 9 నుంచి జరుగుతున్న సప్త సప్తాహములు ఈ నెల 31వ తేదీ పూర్ణాహుతితో ముగుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పెదపులివర్రు వరదరాజస్వామి ధర్మకర్తల మండలి అధ్యక్షుడు కంఠమనేని హరిప్రసాద్, నిర్వాహకులు గొర్రెపాటి హరిబాబు తదితరులు పాల్గొన్నారు,

మహిళా పోలీసులు అప్రమత్తంగా ఉండాలి



వేమూరు: గ్రామ సచివాలయం మహిళ పోలీసులు విధుల్లో అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ చౌడయ్య తెలిపారు. పోలీసు స్టేషన్‌లో మండలంలోని గ్రామ సచివాలయం మహిళా పోలీసులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో దొంగల బెడద ఎక్కువగా ఉందని, మహిళల పోలీసులు రాత్రిళ్లు ప్రత్యేక నిఘా ఉంచాలని ఆయన ఆదేశించారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు తారసిల్లితే, వారి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉంటే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకొని రావాలని చెప్పారు. కార్యక్రమంలో మహిళ పోలీసులు పాల్గొన్నారు.

పెన్షనర్‌ల సమస్యలు పరిష్కరించాలి



రేపల్లె: అపరిష్కృతంగా ఉన్న పెన్షనర్‌ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జె.సుబ్బారావు పేర్కొన్నారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు తహసీల్దార్, సబ్ ట్రెజరరీ కార్యాలయాలలో గురువారం వినతిపత్రం అందజేసి అనంతరం మాట్లాడారు. బకాయిలు ఉన్న టీఆర్ అరియర్లను సత్వరమే పరిష్కరించాలన్నారు. అదేవిధంగా పేఫిక్సేషన్ స్టేట్‌మెంట్‌ను అందించాలని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్లులను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ రత్నం, ట్రెజరర్ నాగేశ్వరరావు, సభ్యులు హరిప్రసాద్, కేఎల్ నారాయణ, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ పాఠశాలకు వంట సామగ్రి వితరణ



యడ్లపల్లి(వేమూరు): జిల్లా పరిషత్ పాఠశాల ఉన్నత పాఠశాల అభివృద్ధికి దాతలు సహకరించాలని పాఠశాల హెచ్ఎం ఝాన్సీ తెలిపారు. చుండూరు మండలంలోని యడ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.50 వేల విలువైన వంట సామగ్రిని యడ్లపల్లి గ్రామానికి చెందిన గడ్డిపాటి ఓబులరావు, గడ్డిపాటి గురుప్రసాద్ రావు జ్ఞాపకార్థకంగా గురువారం అందజేశారని ఆమె చెప్పారు. గ్రామ ఉప సర్పంచి చావా సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంటపొలాల్లో గుర్తు తెలియని వ్యక్తి మృతి

నగరం: పొలాలలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఉల్లిపాలెంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని ఉల్లిపాలెం గ్రామంలో పొలాలలో గుర్తు తెలియని వ్యక్తి శవమై కనిపించడంతో విషయం తెలుసుకున్న వీఆర్ఓ సంఘటనా స్థలానికి వెళ్ళి మృతదేహాన్ని పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీఆర్ఓ ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి నగరం ఎస్ఐ రామకృష్ణ వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం పక్కనే గుళికల ప్యాకెట్, మద్యం బాటిల్ ఉందని తెలిపారు. మృతి చెందిన వ్యక్తి వివరాలను చుట్టుపక్కల విచారించగా ఆచూకీ తెలియలేదన్నారు. దీనిపై కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించి, మార్చురీలో పెట్టేందుకు రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు పంపించినట్లు ఎస్.రామకృష్ణ తెలిపారు. మృతుడికి సుమారు 50 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.